మల్లిక్

మినీకథ

# కడుపుమంట

అది బస్సు స్టాపు. సిటీ బస్సుల కోసం ఎదురుచూస్తూ అక్కడ చాలా మంది ఉన్నారు. ఓ పక్కగా లత నిలబడి ఉంది. ఆమె వంక ఆకలిగా చూస్తున్నాడు విశ్వనాథం. తను ప్రేమిస్తున్న అమ్మాయివంక అలా ఆకలి చూపులు చూస్తున్న విశ్వనాథాన్ని చూస్తున్న కొద్దీ కడుపు మండిపోతూంది శంకర్రావుకి

సుబ్బారావు కడుపు మండిపోతూంది! సుశీల...తన భార్య సుశీల!....మెడలో తనతో లైసెన్సు బిళ్ళలు కట్టించుకున్న సుశీల.... తన సొత్తు...తను పక్కన ఉంటగానే వేరే వాడివైపు అలా గుడ్లప్పజెప్పి చూస్తుందా?....

"ఆ పక్కగా నిలబడదాం పద" అంటూ సుశీలను అటుపక్కకి తీసుకెళ్లాడు సుబ్బారావు.

జోగినాధానికి క్రితం రోజు జరిగిన సంఘటన తలుచుకుంటుంటే కడుపు మండి పోతూంది. ఆఫీసులో క్రితంరోజు తన చేత ఆ కాంట్రాక్టరు పని చేయించుకుని అయిదు వేలిస్తానని అన్నవాడు పని అయిన తరువాత మూడు వేలే ఇచ్చి, మిగతాది తరువాత ఇస్తానని అన్నాడు. హు....పని అయిపోయిన తరువాత మళ్ళీ పనిగట్టుకుని తనకు మొహం చూపిస్తాడా ఆ రెండు వేలు ఇవ్వడానికి?... వ్చ్....రెండు వేలు నష్టం!...

"అసలు అందరికంటే సీనియర్‌ని నేనే నండీ....కానీ ఆ వెధవాయ్‌కు ప్రమోషను వచ్చింది!...ఎందుకంటారూ?...వాడు ఆఫీసరుకు చెంచా అండీ బాబూ...."అంటూ తన కడుపుమంటను సహోద్యోగులకు చెప్పు కున్నాడు చలపతి.

"కైలాసం అంతపెద్ద బిల్డింగ్ కట్టాడంటే డబ్బు చాలా ఉండి ఉండాలి....కారు కూడా కొందామని అనుకుంటున్నాడు...కొనడూ మరి? సీటు మహాత్యం"

పొరుగువాడి పచ్చ చూడలేని పిచ్చయ్య కడుపుమంట ఇది.

బస్సు స్టాపులో ఒక పక్కగా ఉన్న మిరపకాయ బజ్జీల బండిదగ్గర గోపాల్రావ్ నిలబడి బజ్జీలు తింటున్నాడు.

"అబ్బ.. బజ్జీలు చాలా కారంగా ఉన్నాయి. మిరపకాయల్లో మసాలా పెట్టలేదా?...కడుపు మండిపోతుంది" అని బండివాడితో అంటూ బజ్జీలు సగం సగం తిని, సగం సగం పారేస్తున్నాడు గోపాల్రావ్.

గోపాల్రావ్ అలా సగం సగం తిని బజ్జీలు చెత్తమీద పారేయడం చూస్తుంటే ఆ పక్కనే ఫుట్‌పాత్‌మీద కూర్చున్న రంగడికి కడుపు మండిపోయింది.

అవును మరి!...పాపం వాడికి రెండ్రోజుల నుండి తిండిలేదు.